పెద్దకథ

# జీవిత వలయాలు

"మంజుశ్రీ"

ఇక్ష్వాకుల కాలంనాటి సైకిలేసుకొని రామం ఇంటిముందుకొచ్చి దిగాడు. ఆ సైకిలు రఘు మహారాజు రాజ్యం చేస్తూండే కాలంలో రామం తాతచేత కొనబడ్డది. ఇప్పుడా సైకిలంటే రామానికి ప్రాణం. అరఫర్లాంగు దూరం పోవాలంటే ఆ సైకిలుమీద అరగంటకు తక్కువబట్టదు. ఆరు సార్లన్నా దిగక తప్పదు. తండ్రిగారి హయాంలో బెల్లూ, బ్రేకూ పోయింది. రామం మాలిమి చేసుకొనేరోజు లొచ్చేటప్పటికి మడ్‌గార్డ్ పూర్తిగా వొంగిపోయింది. ఈ కీలుగుఱ్ఱాన్ని చూసి స్నేహితులు నవ్వుతుండేవాళ్ళు. హేళన చేస్తుండేవాళ్ళు.

ఈ సైకిలు రామం ఇంటిముందుంచి గడపలో అడుగుపెట్టాడు. చిన్న చెల్లెలు పరుగెత్తుకుంటూ వచ్చి రెండు సంచీలు ఇంట్లోకి తీసుకెళ్ళింది. సైకిలును గడపయెక్కిస్తూ రామం చూసుకున్నాడు. ప్యాంటు క్రిందంతా గ్రీస్ అంటుంది. ఉన్న వొక్క మంచిదీ చెడ్డది. సైకిలును పాత ఇనుపసామానుల కొట్లో అమ్మదామనుకున్నాడు. ఏడుపొస్తున్నది. నవ్వొస్తున్నది. విసుగు బుట్టుతున్నది. అసహ్యం కలుగుతున్నది. సంసార పరిస్థితులమీద ఏవగింపు కలుగుతున్నది. కాసేపు జాలేస్తుంది. తమ్ముడొక్క పెట్టున గుక్క పడుతున్నాడు. నాన్నగారు మంచంలో ముడుచుకొని పడుకున్నారు. అసలే రోగిష్టి శరీరం. పైన ఎండలు మండిపోతున్నాయి.

వంటఇంట్లోకొచ్చి గడపమీద కూచుని వొక్కొక్క సామానుతీసి బయటపెడుతూ ధరలు చెప్పాడు తల్లికి. కొడుకు మొహంలోకి జాలిగా చూసి రమణమ్మన్నది 'మామయ్య ఉత్తరం రాశాడురా' అని. రామం యథాలాపంగా 'ఊహూ' అన్నాడు.

పెద్దచెల్లె లలితవచ్చి అమ్మ మొహంలోకి చూసి, "అన్నయ్యా ఇందిరొదినే"...అన్నది. తల్లి కల్పించుకొని చంటివాణ్ణి తీసుకపోవే అన్నది.

"ఏమిటే ఇందిర" అన్నాడు రామం.

తనకు కలిగిన భావాన్ని లోపలనే అణచుకుంటూ కొద్దిగా బాధ స్ఫురించే మాటలతోటి "నిన్ను చేసుకోదట" అంది రమణమ్మ.

రామం చలించలేదు. అతడికిదంతా వొక విధంగా వుంది. దరీ-దోవా కనపడటంలేదు. అతనికి కలిగిన యీ అనుభూతి ఇంటిమీద ఏవగింపు కలిగేటట్లు చేసింది.

"పోనీలే సుఖపడుతుంది." అన్నాడు రామం, అక్కసు కొద్దిగా ధ్వనిస్తున్న కంఠంతో.

అది ఇందిరమీద కోపంగాదు. ఇందిరమీద అక్కసుగాదు. తల్లి బాధ్యురాలని, తల్లిమీద తన అక్కసంతా యీవిధంగా వెళ్ళబోసుకున్నాడు రామం. రమణమ్మ తెల్లమొహం వేసింది. కొడుకు చెప్పే మాటల్లో అర్థంలేదు. అర్థం ఆవిడకు స్ఫురించలేదు. మొన్నమొన్నటిదాకా ఇందిర తనకు కోడలౌతుందనుకుంది. రామం అలానే అనుకున్నాడు. తలవని తలంపుగా ఇవాళ ఇందిర యీమాట అన్నదంటే దానికేమిటర్థం? రమణమ్మగారికి ఇందిర అభిప్రాయం మీదగాని, ఇందిర వ్యక్తిత్వం మీదగాని నమ్మకంలేదు. ఇది తనికిష్టంలేక అన్నయ్య పన్నిన పన్నాగమే అనుకుంది ఆవిడ మనసులో. ఈ విషయం ఆలోచిస్తూ ఉత్తరం వచ్చిన దగ్గర్నుంచీ, ఆమె మనసు గిలగిలలాడిపోతున్నది. రామం, మామమీద కాస్తంత కోపం వెళ్ళగక్కివుంటే నిజంగా ఆమె మనసులో సంతోషించేది. అటువంటిది రామం మామనేమీ అనకుండా, ఇందిరనేమీ అనకుండా, "పోనీలే సుఖపడుతుంది" అనటం ఆవిడ కేమాత్రమూ నచ్చలేదు. తన అదృష్టాన్ని రామం ఎత్తిపొడుస్తున్నా

డని ఆమె అనుకుంది. అంది "తన సొంతమేనత్త దగ్గరకంటే బావదగ్గరకంటే, ఎక్కువ సుఖపడుతుందేమిటి?" రామం వెంటనే అన్నాడు "మనం దరిద్రులంకామాయేమిటి?" రమణమ్మగారు వెంటనే సామాన్యంగా స్త్రీలకుండే లక్షణం ధ్వనింపజేస్తూ "ఆయనకున్నదిలే మహాలావు బోడిఆస్తి అయ్య సంపాదించి పెట్టిపోతే ఎరగటంలేదు. ముగ్గురి కూతుళ్ళ పెళ్ళిచేసేటప్పటికి అవుతుంది సంబడం" అంది.

రామం విసుక్కున్నాడు. ఆడవాళ్ళు అంతా అంతే. వాళ్ళకు వాస్తవపరిస్థితులు తెలియవు. వాస్తవిక దృష్టి వుండనేవుండదు. ఎంత సేపటికీ తమ లేమితనాన్ని ఒప్పుకోరు, తమకు తెలిసినా తెలీకపోయినా, ఇతరు లా లేమితనాన్ని ఆధారం చేసుకొని, చిన్న బుచ్చబోతే అసలు సహించరు. తాము నిజంగా లేమితో బాధపడుతున్నారు. తాను బి. ఎ. పాసైనాడు. ఎందుకు ఆ డిగ్రీ. ఉద్యోగమిచ్చే నాథుడు లేడు. తండ్రి ఉద్యోగం చేయలేని పరిస్థితుల్లో ఆరు నెలలు సెలవుపెట్టి ఉద్యోగం వదలిపెట్టాడు. ఆస్తిపాస్తులు లేవు. ఎంతో అంత సంపాయిస్తేనేగాని బతుకులు వెళ్ళదీయటాని కవకాశమే లేదు.

"ఇటువంటి వేమీ అమ్మకు తెలియవు" రామం అనుకున్నాడు. దానికి ఉదాహరణగా, అమ్మ సుబ్బమ్మతోటి మాట్లాడిన మాటలను గుర్తు చేసుకున్నాడు. ఎవరివో ఆస్తిపాస్తుల ప్రశంసలు వచ్చి సుబ్బమ్మ "ఆయనకు ఇంత ఆస్తివుంది, ఇన్ని వేల రూపాయల నగలున్నాయి" అని ఏమ్మేమిటో చెప్పుకుని పోతుంటే అమ్మ కల్పించుకుని అన్నది. "ఈ నాలుగు సంవత్సరాలనుంచీ పెద్దబ్బాయికి కాలేజీ చదువు చెప్పించామా, అమ్మాయి పెళ్ళి చేశామా, ఒకరికి తక్కువ గాకుండా కలో అంబలో తాగి బతుకుతున్నామా? లేకపోతే మాకు మాత్రం ఫదివేల ఆస్తి వుండదూ!" అన్నది. రామానికి యిటువంటి మాటలు వింటుంటే మా చెడ్డవిసుగు. అయితే గియితే అని చెపితే తెగమంట, ఇవాళ మళ్ళీ అమ్మ అలానే అనుకుంటున్నది. నిజమే ఇందిరను కోడలుగా తెచ్చుకుందామనుకుంది కాని వాళ్ళంతస్తును గుర్తించాలా? ఇవాళ "వాళ్ళు తమకంటే భాగ్యవంతులా యేమి" అని అనుకుంటే మాత్రం సత్యం మరుగున పడిపోతుందా. రామం ఆలోచించాడు. ఇందిర మంచి పనిచేసింది. అని అతడనుకోలేక పోతున్నాడు. ఇందిర తెలివికల పనిచేసింది. అంతమటుకతడు ఒప్పుకుంటాడు. ముందు వెనుక లాలోచించింది బాగా. నిశ్చయాని కొచ్చింది. ధైర్యంగా నిలబడి చెప్పగలిగింది. మనసులో ఎంత గుర్రుగావున్నా, ఇందిరను మనసులో మెచ్చుకోకుండా వుండలేక పోయినాడు రామం. తల్లి అమితంగా బాధపడటం అతనికి తెలీకపోలేదు. అది సహజమనుకున్నాడు అతను. కాని తల్లి ఎక్కువగా యీ విషయం ఆలోచించటంగాని, క్రోధపడటంగాని అతనికి నచ్చలేదు.

రమణమ్మగారు మాత్రం యీ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. అన్నయ్య తనను మోసం చేశాడు. తను ఎంతగానో మురిసిపోయింది. అందరితోటి నా కోడలు, నా కోడలు, అని చెప్పుక తిరిగింది. ఇందిర బజార్లో పోతుంటే 'రమణమ్మ కోడలు, అని అనేవాళ్ళు. కాని ఇవాళ యింత త్వరగా పరిస్థితులు ఎందుకు తారుమారైనాయో, ఆమెకు తెలీటంలేదు. క్రిందటేడు వచ్చినప్పుడు అన్నయ్య యీ విషయంతో తనకు సుముఖంగా వున్నాడు. ఇప్పుడు మాత్రం విషమబుద్ధి తెచ్చిఫెట్టుకున్నాడు. సంబంధంకూడా కుదుర్చుకొని వుండాలి. లేకపోతే వచ్చే నెలలో పెండ్లిచేస్తానని ఎందుకు రాస్తాడు? ఎలా రాస్తాడు? విచిత్రంగావుంది. పెండ్లికి వెళ్ళగూడదు అనే నిశ్చయానికి రావటానికి రమణమ్మగారికి ఎక్కువసేపు పట్టలేదు. ఆమెకు చాతనైంది అంతే. తనకు జరిగిన యీ పరాజయానికి, యీ ఘోర అవమానానికి, అన్నయ్య కావిధంగా బుద్ధిచెప్పాలని ఆవిడ ఊహించింది. రామం మాత్రం ఆవిధంగా ఊహించలేదు.

అనుకున్నట్లే లగ్నం పది రోజులుందనగా రామం మామయ్య దిగపడ్డాడు. రామం ఇదివరకటి కంటే ఎక్కువ ప్రేమతో పలకరించాడు మామయ్యని. ఆయన మాత్రం తన చెల్లెలు పైకి ఎలా మాట్లాడుతున్నా గంటుపెట్టుకొని వుండటం గ్రహించకపోలేదు. బావగారితో ఎక్కువ విషయాలాయన మాట్లాడలేదు. ఇద్దరూ ముభావంగానే ఫుండిపోయారు. స్కూళ్ళకెళ్ళే పిల్లలు

స్కూళ్ళకెళ్ళిన తర్వాత రామం బజారు కెళ్ళిన తర్వాత, ఆయన చెల్లెలతో అన్నాడు, చూడు చెల్లెమ్మా "ఇందులో నా స్వార్థము, పీసమైనా లేదు, నా సంగతి నీకు తెలియక పోతేగా" అని. రమణమ్మగారు అందుకుంది "అవునన్నయ్యా, చిన్నవాళ్ళు ఏదైనా తెలీక తప్పు దోవలపడితే తెలియ చెప్పేభారం తల్లిదండ్రుల మీదలేదా? పాడైనదానికల్లా తల వూపటమేనా?"

"ఇదుగో అమ్మా, వాళ్ళేం చిన్నపిల్లలా చెప్పటానికి? వాళ్ళకు వయసువుంది. తెలివితేటలు వున్నాయి. వాళ్ళ బాధ్యత వాళ్ళకు తెలీదంటే నేను నమ్మను. బలవంతంగా నా అభిప్రాయాలు వొకరిమీద ఎలా రుద్దేది?"

"వొకరా. వొకరితో నీకు పనేమిటి. కన్న కూతురు కాబట్టి తెలుసుకోలేకపోతే తెలియ చెప్పాలి."

"అందుకే అసలు చెప్పరేను. అయినా ఇందిర ఆలోచించి చూడకుండా ఏపనీచెయ్యదు. సార్థకం చేసుకుంటుందని నా నమ్మకం. ఒకరోజున వచ్చింది నాతోచెప్పింది తన నిశ్చయాన్ని. వాళ్ళమ్మతోటి కూడా చెప్పలేదు నేరుగా నా దగ్గరికే వచ్చి చెప్పింది. నేను అయిష్టాన్ని వ్యక్తంచేశాను. అమ్మాయి బాధపడింది. కారణాలు అడిగాను చెప్పింది. వొప్పుకున్నాను."

ఈ విధంగా కూతుర్ని సమర్థిస్తూ ఆయన మాట్లాటం, రమణమ్మ కేమాత్రమూ యిష్టంలేక పోయింది. ఆమెకు లోపల యీర్ష్యా, క్రోధమూ పెనవేసుకొని, జాజ్వల్యమానంగా మండిపోతున్నాయి. కాని ఆమేం చేయలేదు. అది కూడా ఆమె బాధ నిమడింపచేసింది. ఆవిడ తర్కయుక్తంగా మాట్లాడలేకపోయింది. పళ్ళుబిగించి, కసిగా "ఏమిటీ ఆ కారణాలు" అంది.

"అమ్మా, అవన్నీ యిప్పుడెందుకు. ఇంతకూ ఎవరి మొహాన ఎలా రాసిపెట్టివుంటే అలా జరుగుతుంది తప్పదుకదా. నేనొకటి చెపుతాను విను. నిన్ను బావకిచ్చేద్దామని అమ్మా, నాన్నా ఎంత ప్రయత్నం చేస్తేమటుకు ఫలించిందా. ఆయన నిష్కర్షగా, ఏమి చూసుకొని మరి అంత యిదయినాడో కాని "నేను చేసుకోను" అని చెప్పలేదూ. అప్పుడుగదా యీ సంబంధం నాన్న చూసి వచ్చింది. స్వయంగా మేనత్తకొడుకు గదా, అత్తగాడికి ఆ బుద్ధి ఎందుకు పుట్టవలసి వచ్చింది. విధి లిఖితం అంటారే. అదేనుమరి! ఏది ఎలా వుంటుందో ఎవరమూ చెప్పలేము. జరుగుతుంటే చూసి తెలుసుకోవాల్సిందే. ఆవాళ బావ నిన్నొల్లనన్నాడు. ఇవాళ ఇందిర తన బావను వొల్లనంటున్నది. ఇందుకు కారణాలు సాగదీసి నేనేం చెప్పను. అథవా చెబుతాననుకో, అందువలన ప్రయోజనమేమైనా వుండాలా. ప్రయోజనం లేనిదే అవన్నీ యిప్పుడెందుకు, వెంకటరత్నం బావగారింటికొక్కడా పోయి, పార్వతీనీ, ఆవిడనూ తీసుకొద్దామనికూడా అనుకుంటున్నాను. బావే వుంటే పనిగట్టుక దూక్క పోయాడా! ఆయన గతి అలా అయింది. నాకంటే రెండేళ్ళే కదా పెద్ద. నలభైయేళ్ళకే చావు, రావాలా, అప్పుడేపాయి పదేళ్ళు కావస్తున్నది."

రమణమ్మ కళ్ళముందు వొక నల్లటి తెర ఎత్తేసినట్లయింది. ఆకాశం స్వచ్ఛంగా నిర్మలంగా కన్పించింది. మనో మాలిన్యమంతా వొక్కసారి తుడుచుక పోయినట్లయింది. కాని ఆవిడ మనస్సును పూర్తిగా చిక్కబట్టుకోలేదు. తమ దరిద్రంమీద, తమ దైన్యావస్థమీద, యిది చెప్పకుండా కొట్టిన బలమైన దెబ్బగా విశ్వసించింది. తాత్కాలికంగా పరిస్థితులను మరచిపోయింది. వాతావరణాన్ని గమనించలేదు. పాతికేళ్ల వెనక్కు పరుగెత్తికెళ్ళి నిల్చుంది. దొడ్లో మల్లిపందిరి కింద తాను వెంకటరత్నం బావకు నీళ్లు తోడి వీపు రుద్దుతున్నది. బావ వుండుండి వెనక్కు నీళ్ళు చల్లేవాడు. తనకు గట్టిగా కోప మొచ్చేసింది. చెంబుతోటి మెల్లిగా మొట్టింది. బావన్నాడు గదా "ఆసి గయ్యాళిదానా! నిన్ను చేసుకుంటే నన్ను బతకనిచ్చేట్టు లేవే" అని. తనకప్పుడు పదేళ్ళు. ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, చట్టిబళ్ళు, నమ్రతలు, తన కప్పుడు తెలియవు. బావ! తనను చేసుకోబోయేవాడు అనే పరిజ్ఞానమే తనకు లేదు. ఈసారి గట్టిగా మొట్టి "నన్ను చేసుకుంటే నీ తిక్క కుదర్చనూ" అన్నది. వెంకటరత్నం బావ రెండు చేతులతో తనను వొడిసికట్టి ముందుకు లాక్కొని బుగ్గలు కొరికేశాడు. "అమ్మా చూడవే యీ ముదనొష్టపోడు" అని అరచింది తాను.

మసక వెన్నెట్లో తానా రోజు తెలుసుకోలేక పోయిందిగాని, వెంకటరత్నం బావ కళ్ళలో వురుములు ఉరిమి, మెరపులు మెరసినై. అమ్మ నవ్వుతూ తనదగ్గరకొచ్చి "బావనలా అనకూడదు తప్పమ్మా!" అన్నది.

తరవాత మూడేళ్ళ తరవాత, నాన్న వెళ్ళి లగ్గాలు పెట్టించుకొద్దామని వెళితే, వెంకటరత్నం బావ నిష్కర్షగా చెప్పేశాడట "రవణిని నేను చేసుకో"నని. నాన్న ఎంతో చెప్పి చూశాడు. అత్తయ్య ఎంతో చెప్పి చూసిందట. తండ్రి లేక పోయే; ఏ మాటకూ ఎగర్తించి చెప్పాడట. అత్తయ్య యేడ్చిందట. అయినా వెంకటరత్నం బావ తనను చేసుకోటానికి యిష్టపడలేదు. ఎందుకో ఆనాటినుంచీ యీనాటిమటుకూ తనకు తెలీదు. ఐదేళ్ళయింది వెంకటరత్నం బావ చచ్చిపోయి. రవణమ్మకు వాళ్లు గగుర్పొడిచింది. నిజంగా బావ తననే చేసుకునివున్నట్లయితే ఏమి అయ్యేదో. రవణమ్మ ఆ ఊహ నలా వదిలేసింది. ఎక్కువసేపు ఆ ఆలోచనలలో వుండలేకపోయింది. వెంటనే మామూలు ప్రపంచంలోపడ్డది, అనుకుంది, నిజం మరి! పెండ్లిండ్లు రాతప్రకారం జరుగుతాయి వెంటనే ఆమె మనసులో ఎదురుశక్తి మేలుకుంది. అన్నది: రాతట! రాత! రాత! రోజులు మారి పోయినయ్. మొగవాడు వద్దనటం పోయింది. ఆడవాళ్ళకూ్కడా యింత చనువా. ఇంత స్వతంత్రమా. ఆవిడ మనస్సులో ఇందిరమీద అసహ్యం పెల్లుబికింది. ఆవిడ ఏమీ చెప్పకుండా ఏదో ఆలోచించుకుంటూ కూచుంది. ఇంతలోకే రామం వచ్చాడు. "అమ్మా వంటయిందటే" అన్నాడు.

రవణమ్మగారు గొంతులోని అసహజతను వ్యక్త పరచకుండా "అవుతున్నదిరా నాయనా! ఇదాకటినుంచి పిల్లవాడు వొకటే యేడుపు" అన్నది. సరే కానియ్యి, అని రామం, మామయ్యవైపు తిరిగి "ఇందిర యిక చదువు మానేస్తుందా మామయ్యా" అని అడిగాడు. "ఏమిటోరా దానిష్టం, చదువుకోవాలనుకుంటే చదువుకుంటుంది, లేకపోతే మానేస్తుంది." అన్నాడాయన. "చదువుకోవటమే మంచిదిలే మామయ్యా" అని రామం తండ్రిదగ్గర కెళ్ళాడు మందు కలిపియ్యటానికి.

తండ్రి ఎంతో ప్రయత్నిస్తేకాని మాట్లాడలేడు. నాలుగు ముక్కలు మాటాడితే ఆయాసం వస్తుంది. రామం మందు కలిపి నోట్లోపోస్తుంటే ఆయన గుటకలువేస్తూ ఏదో మాట్లాడదామని ప్రయత్నించేశాడు. రామం ఆ సంగతి కనిపెట్టాడు. తండ్రి మొహంలో అణగిమణగివున్న వ్యథను ఆతడు గుర్తించకపోలేదు. ఆయన అనుకున్నాడు. నిజంగా, అయినసంబంధం చేసుకుంటే తను సుఖపడి పోయేవాడు. తన రామానికి అండదండగా వుండేది- కాని అది ఇలా తిరిగిపోయింది. అందుకే ఆయనకింత వ్యథపైన ప్రొద్దుట లలిత చెప్పిపోయి నప్పటినుంచి, ఆయన ఇంకోవిషయం ఆలోచిస్తున్నాడు. రామం ఏమన్నా బాధపడుతున్నాడో ఏమో! తాను వాణ్ణి వోదార్చాలి. చూడు నాయనా! "మామయ్య పిల్లనీయక పోయినంత మాత్రాన నీకు కావటం జరగకపోదు. ఇయ్యక పోతే ఇయ్యకపోయినాడులే" అని చెప్పాలని ఆయన వుద్దేశం. మందు ఇయ్యటానికి వచ్చిన రామం మొహంచూసిన తర్వాత ఆయనకు కొద్దిగా స్వాస్థ్యం చిక్కింది. కాని రామానికి తానా నాలుగుముక్కలు చెపితే బాగుండును. ఆయన బాధ రామం అర్థంచేసుకొని "పోనీలేనాన్నా! నువ్వేమీ దిగులుపడకు ఇందిరను చేసుకోవటమే నాకసలు ఇష్టంలేదు" అన్నాడు. కాసేపు ఆయన మొహం కళకళలాడింది. నిజంగా తాను ఆత్మవంచన చేసుకుంటున్నట్లు రామానికి తెలుసు. అయితేనేం తండ్రి మానసిక వ్యథన్నా తొలగిపోవాలి.

మధ్యాహ్నం పూట భోజనంచేసి వెంకట్రామయ్యగారు వెళ్ళిపోయారు రాజమండ్రి. రామం రైలుస్టేషనుదాకా మామయ్యతోటివచ్చి రైలెక్కించి వెళ్ళిపోయాడు. ఎండ తీవ్రంగావుంది. గుంటూరు తారురోడ్లు వుడికిపోతున్నయ్. రామం కాళ్ళకు చెప్పులుగూడా లేవు. దరిద్రాన్ని అనుభవించటం ఏమంత పెద్దకష్టాల్లో లెక్కగాదు. అలవాటైతేసరి, అవలీలగా దరిద్ర మహాసాగరమున నీదులాడంగవచ్చు. ఇదిలేదు, ఇదివున్నది అనే తలంపేరాదు. అష్టకష్టాల్లో దరిద్రాన్నికూడా చేర్చారు చిన్నయసూరి. రామం చుఱ్ఱుచుఱ్ఱున కాళ్ళు కాలుతుంటే ఇందిరను, మామయ్యనూ,

తండ్రినీ, తల్లినీ, లలితనూ గురించి ఆలోచించుకుంటూ ఇల్లుచేరాడు.

లలిత చేటలో బియ్యం పోసుకొని ఏరుతూ కూచుంది. వంటయింటి గడపకు క్రిందకు కూర్చుని రమణమ్మగారు కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నది. లలిత అంటున్నది. "చూడమ్మా ఎందుకలా కళ్ళనీళ్లు పెట్టుకుంటావు? అన్నయ్యకు పెండ్లిగాదని దిగులా? మహ బాగా అవుతుంది. నువలా కళ్ళనీళ్ళు పెట్టుకుంటే ఎంత అవాచ్యం. అన్నయ్య చూస్తే ఇంటిలోంచి పారిపోతాడు" రామం ఇంట్లో అడుగు పెట్టే సమయానికి రంగం ఇలా వుంది. రామానికి తల్లి అంత బాధపడటం ఎందుకో అర్థంకాలేదు. చిన్నచెల్లెలూ, తమ్ముడూ, స్కూలునుంచి ఇంటికి రాలేదు. చిన్న పిల్లవాడు నిద్రపోతున్నాడు. ఇల్లంతా బోసికొడుతున్నది. దారుణంగా నిశ్శబ్దం అలుముకుంది. రామం సరాసరి వంటయింటి గడప మీద కూచుని "అమ్మా ఇలావుంటే యెలాగే, అసలే యీ పరిస్థితులకు తోడు మీ రిలా పిచ్చి పిచ్చి ప్రసంగాలు చేస్తుంటే నాకు పిచ్చెక్కి దేశాల మీద పోతాను. మరేం మునిగిపోయింది లేదు. జీవితాంతంమటుకు సన్యాసిగా వుండాల్సిన రాత కలగదు నాకు. నాకు ఎంత ఆలోచించినా నీ విప్పుడింతగా బాధపడటానికి కారణం కన్పించడం లేదు" అన్నాడు. నిజం. ఉన్న పరిస్థితుల్లో వీలైనంత సంతోషంగా వుండటానికి ప్రయత్నించకపోతే యీ ఇంట్లో ప్రతివారికీ పిచ్చెక్కేటట్లే వుంది. ఆవిడింకేమీ మాట్లాడలేదు. చిన్న చెల్లెలూ, చిన్నతమ్ముడూ బడినుంచి ఇంటికొచ్చేశారు. రామం వీపున వచ్చిపడ్డది చెల్లెలు. చెల్లెల్ని ముందుకు తీసుకున్నాడు రామం. బట్టలన్నీ కుట్టు కుట్లు. కుట్టునచోట్లు ఎన్నో అంతకు రెట్టింపు చిల్లులు మళ్ళీ అగుపడుతున్నాయి. రామంహృదయ వేదనతో కలుక్కుమంది. నాన్నగారు జబ్బునపడకముందు తమ స్థితి యిలా వుండేదిగాదు. ఇంట్లో తిండికీ గుడ్డకూ ఎలాంటిలోటూ అవపడేది గాదు. హాయిగా జరిగిపోతుండేది. రామం వొళ్ళోంచి చెల్లెలును దింపివేశాడు. లలిత కనపడ్డది. ఒంటిమీద ఒక్క సొమ్ము లేదు. బట్టలు మంచివి లేవు. పెండ్లికి తానూ, లలితన్నా తప్పకుండా పోవాలి. లేకపోతే ఏమీ బాగుండదు. త్వరలో లలితను అత్తారింటికి పంపించాలి. నాన్న కలవరిస్తున్నాడు. రామానికి హృదయంలో ఇన్ని భావనలు ఒక్కసారిగా సుళ్ళు తిరిగినయ్. లేచి, "అలా వెళ్ళొస్తానమ్మా" అని బజారునపడ్డాడు. ఎటు పోవటానికి తోచలేదు. తిన్నగా మేజిస్ట్రేట్ గారి ఇంటికి వెళ్ళాడు. ఒకసారి రామం ఆయన దగ్గరికి ఏదైనా వుద్యోగ మిప్పించండి, అని ప్రాధేయపడటానికి వెళ్ళాడు. రామం తండ్రి ఆయనకు తెలుసు. ఆయన అదృష్టం నెట్టుకొచ్చి పదేళ్ళ రాట్ అయి ఆయన మేజిస్ట్రేట్ అయినాడు. రామం తండ్రిని రెవిన్యూ ఇనస్పెక్టరు గిరీ వదలకుండా వుండేదేగాని, పక్షవాతం వచ్చి వుద్యోగాన్నే వదలిపెట్టింది.

ఆయన అంతా విని బాధపడి "మా పిల్లలు ముగ్గురికీ సాయంకాలం వచ్చి ఓ గంట చదువు చెప్పు! పదిహేను రూపాయలిస్తాను" అన్నారు. ఈ సూచన రామానికి తెగ నచ్చింది. ఇదివరకు తనకిది తోచలేదు. మనసులో పరమానందపడి 'చిత్తం' అనకుండా వుండలేకపోయాడు. ఇవాళ వెళ్ళేటప్పటికి సాయంకాలం కావటాన షికారు కెళ్ళే ప్రయత్నంలో వున్నా రాయన. ఆయనకు నమస్కారం వదని, చేతులు నలుపుకుంటూ నసిగాడు రామం. ఆయన నవ్వుకొని ఏమిటి? అన్నాడు. రెండు రోజుల్లో బెజవాడకు పెళ్ళికి వెళ్ళాలి...అక్కడనుంచి వరసాగా ఫులిస్టాపులు పెట్టుకుంటూ నసిగాడు రామం. మేజిస్ట్రేట్ గారు ఇంట్లోకి కేకేసి వెళ్ళిపోయారు. రామం పిల్లలకు ఓ గంట చదువు చెప్పి పదిహేను రూపాయలు పెద్ద పిల్ల ఇస్తే తీసుకొని బజారుకొచ్చాడు. రామం ఇట్లానే ఇద్దరుముగ్గురు ప్లీడర్ల ఇళ్ళలో కూడా పిల్లలకు చదువులు చెపుతాడు. మొత్తం నెలకు యాభై రూపాయలు సంపాయిస్తేకాని, యిల్లు అంతంతమాత్రం గడవటం కష్టంగా వుంది. ఓ పాతికరూపాయ లిప్పుడు జేబులో వుంది. ఓ ప్లీడరుగారు రెండుమూడు రోజుల్లో ఇస్తానన్నారు. మరొకాయన రేపన్నాడు. సరిపోయింది. వీధుల్లో ఎలక్ట్రిక్ దీపాలు వెలిగినయ్. రామం నడచినడచి గుడ్డలకొట్లో కొకదాంట్లోకి దారితీశాడు. చక్కటి మెర్క్యురీ లైట్ల కాంతిలో బీరువాలు ధగధగ మెరిసిపోతున్నాయి.

కింద కార్పెట్స్ పరచివున్నాయి. అదోక మోసం. గజం ఫరణాలు చేసేగుడ్డ కూడా కొట్లోవున్న కాసేపూ, లైట్లకింద సిల్కులాగా మెరిసిపోతుంది. బయట కొస్తేగాని అసలు రంగు బయటపడదు. రామం వెళ్ళి కూచున్నాడు. "ఏంకావాలండి?" వినయంగా షావుకారు ప్రశ్నించాడు. ఇంతలోకే సుబ్బారావు కావ్‌స్టెన్ సిగరెట్టు పొగ వదులు కుంటూ దూసుకొచ్చాడు కొట్లోకి. "ఏరోయ్ రామం, చాలాకాలానికి కనపడ్డావ్? ఏమిటి విశే షాలు." రామం మొదలు దిగాలు పోయాడు. తరువాత గుర్తోచ్చింది. ఇంటర్ మీడియట్ తనతోటి చదివి, తప్పి స్వంతవూరు వెళ్ళిపోయాడు. "ఏమిటి సంగతి, ఇంటర్ పూర్తయిందా? ఏం చదువుతున్నావ్?" ప్రశ్నించాడు రామం. "తరవాత చెపుతాలే. ముందు గుడ్డలు తీసుకో అలా వెళుతూ చెప్పుకుందాం" అన్నాడు సుబ్బారావు. చీరలు చూపించండి, అన్నాడు రామం. ఎంత ఖరీదువి? ఏభైవి చూపమంటారా, నలభై చేసేవి చూపమం టారా? అన్నాడు షావుకారు. రామానికి చిర్రెత్తింది. ఏవో చూపుదూ? నేతచీరలు, సాదావి మంచివి చూపు అన్నాడు. గుమాస్తాముందు ఒక కుప్పపడేసి పోయాడు. రామం కళ్ళు అప్రయ త్నంగా వొక చీరమీదికి పోయినయ్. ఎదురింటి ప్లీడరుగారమ్మాయి ఒకరోజు పేరంటానికి పిలవ టానికి వచ్చినప్పుడు కట్టుకొచ్చిన చీరలాంటిదే అచ్చంగా. అప్పుడు తను భోజనం చేస్తున్నాడు. నీలిరంగు చీర చక్కటి అంచు. జరీపోగులూ, ఆ చీర తనకు చాలాబాగుంది. ఆ అమ్మాయి వెళ్ళిపో గానే లలిత ఓ అరగంట సేపు ఆ చీరను పొగిడింది. ఆ చీర అంటే లలితకు చాలా యిష్టం, ఆ చీరను రామం విమర్శగా పరీక్షించటం చూసి, సుబ్బా రావు దాని ధర ఎంతని అడిగాడు గుమాస్తాని, ఇరవై వొకటింబావులా. అని చెప్పాడు గుమాస్తా రామం వాస్తవిక జగత్తులోకి వచ్చాడు. ఒక్క సారి తృళ్ళిపడ్డాడు. చిన్నచెల్లెలుకు గౌనుగుడ్డ తీసుకెళ్ళాలి. అసలు జాకెట్ గుడ్డ తీసుకెళ్ళ కుండా పోవటం అవాచ్యం. రామం మీ మాంసలో పడడం చూసి సుబ్బారావన్నాడు. "తీసుకో రామం, నాకూ్కడా చాలా బాగుంది. కావల్సుంటే ఫదిరూపాయలు నా దగ్గరున్నంచే తీసుకో, నా దగ్గరుందిలే" అన్నాడు. రామం కళ్లు వొక్కసారి కృతజ్ఞతతో విప్పారినయ్. నిమిషం సేపు సుబ్బారావు వంక, బృందావనంలో గోపికలు శ్రీకృష్ణుని వైపు చూసినట్లు చూశాడు. సుబ్బా రావు పర్సు తెరచి బొత్తితీసి ఫదిరూపాయలు రామంచేతికంతిచ్చాడు. ఆ చీరా, రెండు గజాలు గౌనుగుడ్డా రెండుగజాలు జాకెట్ కుతీసుకున్నాడు. మొత్తం ముప్ఫయి రూపాయలయింది బిల్లు, సుబ్బారావు గుడ్డలమీదగారెలబుట్టమీద విరుచుక పడ్డట్టు విరుచుకపడ్డాడు. కొట్టునుంచి బయట కొచ్చి సుబ్బారావు వద్దన్నా వినకండా కాఫీ కీడ్చుకపోయాడు. చెప్పాడు తన సంగతంతా తను పెళ్ళి చేసుకున్నది గుంటూర్లోనేనట. అత్త గారు చాలా ఆస్తిమంతులట. మామగారు ఎంతో పలుకుబడి కలవారుట. తాను ఇంటర్ పూర్తి చేశాడు. తల్లి పొలంపనులు చేయిస్తూ ఇంటిదగ్గర్నే వుందట. తనకు మామగారు కోపరేటివ్ ఇన్‌స్పె క్టరు ఇప్పించారట. మొత్తం నూటయాభై గిడ తాయాట. ఓ యాభైరూపాయల గుడ్డలు కొన్నా డివ్వాళ్ళ—అనుకున్నాడు రామం. అత్తగారింటి అడ్రసు చెప్పి ఎప్పుడైనా అవపడుతుండమని చెప్పి వెళ్ళిపోయాడు సుబ్బారావు. రామం ఇంటి కెళుతూ 'ఎంత అదృష్టవంతుడు సుబ్బారావు' అనుకున్నాడు పదేపదే. కాని సుబ్బారావును గురించి రామం యీర్ష్యపడలేక పోయాడు. అతడి లోని నరం నరంలోని ప్రతిరక్తబిందువూ, సుబ్బా రావు యెడల కృతజ్ఞతతో నిండిపోయింది. నవ్వు ముఖంతో ఇల్లు చేరుకున్నాడు. చిన్నచెల్లెలు గడపమీద కూచుని యేడుస్తున్నది. రామంవెళ్ళి యెత్తుకున్నాడు. చూడన్నయ్యా, చంద్రం ఎలా గిచ్చాడో, అన్నది చెల్లెలు యేడుపు దిగమింగి. వాడిపని నేను చూస్తాలేగాని మరి నాచేతిలోది ఏమిటో కనుక్కుంటే, కనుక్కుంటే...గడపమీద వొళ్ళో చెల్లెల్ని కూచోబెట్టుకుని కూచున్నాడు రామం. చంద్రం తనకన్నీ తెలిసినట్లు పోజుపెట్టి 'మెరపగాయలు' అన్నాడు. చెల్లెలు కాదు, నువు చెప్పకు, నేనేచెప్పుతా, అంటూ 'మెరపకాయలు' అంది. ఇందాక బజారుకెళ్ళేటప్పుడు 'మెరప కాయలు లేవు' అని అమ్మచెప్పటం ఇద్దరూ విన్నారు. రామంనవ్వి, కాదు అన్నాడు. చంద్రం

'ఉప్పు' అన్నాడు. చెల్లెలు 'పంచదార' అంది, లలిత కల్పించుకొని 'నే చెప్పనా అన్నయ్యా' అంది. 'చెప్పు చూదాం' అన్నాడు రామం. ఉత్సాహంగా కాసేపాలోచించి 'బార్లీగింజలు' అంది లలిత. నిన్నప్రొద్దుట తాను రామంతోటి 'నాన్నగారికి బార్లీగింజలు కావాలి పట్టుకరమ్మని' చెప్పింది. అవి తెచ్చివుంటాడని లలిత ఊహ. 'ఇంట్లో అందరూ పిచ్చిమొహాలే, వొక్కరూ కనుక్కోలేకపోయారు, శారదకు గౌనుగుడ్డ మంచిది తెచ్చాను, అన్నాడు రామం నవ్వుతూ. లలిత గబగబా ముందుకువచ్చి పొట్లం తీసుకుంది. దీపంముందుకు తీసుకెళ్ళి విప్పటం మొదలెట్టింది. శారద వొళ్ళోంచి దిగి అక్కపక్కన కూచుని ఆసక్తితో చూడటం మొదలెట్టింది. రవణమ్మగారు కూడ గంటె వదిలేసి చూడటానికొచ్చింది.

పొట్లంవిప్పి పైకి తీసిచూసి లలిత క్షణమాత్రం తన్నుతాను మరచిపోయింది. క్షణం అన్నయ్యవైపు కన్నార్పకుండా చూసింది. అమ్మ అడిగింది. "నువ్వు చొక్కా లాగూ కుట్టించుకోవాల్సిందిరా నాయనా, ముప్ఫయి రూపాయలు, వీళ్ళకెందుకు ఖర్చుపెట్టావు చెప్పు' అంది రవణమ్మ శ్వాస ఎగపీలుస్తూ. 'మొగవాణ్ణి నాకేమిటే, రేపు పెళ్ళికెళ్ళినా లలితకొక్క మంచిగుడ్డయినా లేకుంటే బాగుంటుందా చెప్పు!' అన్నాడు రామం, ఆ చీర బాగుంది, అంది అమ్మ. శారద మొహం సూర్యముఖి పుష్పమంత వికసించింది. లలిత వొక్కమాట మాట్లాడలేదు. "అమ్మాయ్, ఆచీర బాగులేదూ?" అన్నాడు రామం. లలిత తలవూగించి 'నాన్నగారికి చూపించటానికి లేచింది. వంట ఇంటి గడప దాటుతుంటేలలిత కళ్ళనిండా కన్నీళ్ళు జలజలాడినై. రోగిష్ఠి తండ్రివున్న గదిలోకి ప్రవేశిస్తూ గడపదగ్గర నాలుగు నిముషాలు కన్నీళ్ళు తుడుచుకుంది లలిత. వెనకనే వచ్చిన శారద కొంగు పట్టుకొని లాగి "రా అక్కయ్యా, నాన్నకు చూపుదాం" అంది. లలిత లోపలకెళ్ళి చూపించింది. రోగి మొహం వికసించి తృప్తితోటి నిండిపోయింది. బాగుంది అని సైగచేసి కళ్లు మూసుకొని పడుకున్నాడు. ఆ రోజు రామానికి హాయిగా వుంది. ఇంట్లో కాసేపటిదాకా సంతృప్తీ సంతోషమూ పెనవేసుకపోయినై.

రవణమ్మగారు కొడుకు బలవంతాన తానుకూడా పెళ్ళికొస్తానని వొప్పుకుంది. కాని లగ్నం రెండురోజు లుందనగా, ఇంటి యజమాని శరీర పరిస్థితి మరీ దిగజారిపోయింది. ఇదివర కటిదాకా ఆయన్ను చూడటానికి లలితను వుంచి పోదామని సంకల్పం. రవణమ్మగారు గొంతుకోసినా యిల్లు కదలనంది.

మర్రోజు పెండ్లికి రామం. లలితా, యిద్దరూ కలసిపోయారు. "నేను వస్తానని" చిన్న పిల్లలు కాసేపు గోలచేశారుగాని వీళ్ళిద్దరూ బయలుదేరి వెళ్ళిపోయారు. అమ్మమ్మ వీళ్ళిద్దరినీ ఆప్యాయంగా తీసుకెళ్ళి గదిలో కూచోబెట్టి విషయాలన్నీ సాకల్యంగా వొక్కొక్కటే అడిగి తెలుసుకుంది. ఆమెకు అంతరాంతరాలో ఎక్కడో బాధ మెలికపెట్టక పోవటంలేదు. తాను కలలు కన్నది. ఇందిరనూ, రామాన్నీ కలిపి వొక ఇంటివాళ్ళను చేయాలని. అటువంటిది రామం. ఇందిర పెండ్లికి మామూలుగా సామాన్య బంధువులవలెనేవచ్చాడు. ఆమె కాసేపు బాధపడ్డది. "బావను చేసుకోను" అని ఇందిర ఎప్పుడైతే ఖచ్చితంగా తేల్చిచెప్పిందో అప్పుడే ఆమె హృదయాంతరాళంలో ఇందిర మీద పట్టరానంత ఆగ్రహం కలిగింది. తరువాత అది అసహ్యంగా మారిపోయింది. కాని ఇందిర ఎవరు? తను ఎత్తి పెంచిన బిడ్డ. రెండు రోజుల్లో ఆమె మామూలు మనిషైంది. రాత! ఎవరు తప్పించగలరు. 'తన రవణికి వెంకటరత్నం చేసుకున్నాడా' ఎంత ప్రయత్నం చేస్తేమటుకు, అనుకుంది. ఒక గంట అయిన తర్వాత మామయ్య రామాన్ని రహస్యంగా గదిలోకి పిలిచి, "చూశావా, మీ అమ్మ నన్ను నలుగురిలో ఎంత నవ్వులపాలు చేసిందో" అన్నాడు. రామానికి కోపమొచ్చింది. "ఏంచేసిం దేమిటి?" అన్నాడు. "ఎందుకు రాక పోవాలి?" అన్నాడు మావయ్య. రామం పరిస్థితుల నంతా సాకల్యంగా వివరించి చెప్పి, "నువ్వనేదాంట్లో అర్థంలేదు. నేనూ లలితా వచ్చాము కదా? అమ్మ ఎలా వస్తుందనుకున్నావు. నాన్నకలా వుంటే వదిలేసి నీ యింట్లో పెండ్లి పప్పన్నాలకు రావాలా?" అన్నాడు. వెంకట్రామయ్యగారు నాలిక కరచుకొని "అలా అని నాకేం తెలుసురా నాయనా, నాకు తెలీక అన్నాను, ఏమనుకోకు

బాబూ." అన్నాడు అనునయంగా. ఇక అక్కడ వుండలేదు. ఏదో పని కల్పించుకొని అక్కడనుంచి మెల్లిగా జారుకున్నాడు. రామం ఇల్లంతా ఒక సారి కలియజూచి ఎరిగున్న బంధువు లందరినీ పలుకరించాడు. ఇందిరా, లలితా మాట్లాడుకుం టున్నారు. రామం, ఏదో తప్పుచేసినవాడిలాగా అక్కడనుంచి పక్కకు తప్పుకొని వరండాలోకి వెళ్ళిపోయాడు. అక్కడున్న పెద్దమనుషులు, ఆడా మగా అందరూ, తనను "అయ్యో పాపం చాలా దురదృష్టవంతుడు" అనే భావనతో చూడటం చూసి రామానికి నవ్వొచ్చింది. చిన్న చిన్న పనుల్లో జోక్యం కల్పించుకుంటూ అతగాడు వరండాలోనే వుండిపోయాడు.

పెండ్లి పెద్ద తానే నన్నట్లూ, అక్కడ తాను లేకపోతే ఏ పనీ జరగదన్నట్లూ, ప్రతి పనిలో తానే జోక్యం కల్పించుకుంటూ, నిలవకుండా పరిగెత్తుతున్న అమ్మాయిని చూసి రామం కాసేపు ఆశ్చర్యపడ్డాడు. గుర్తు తెచ్చుకోవటానికి చాలాసేపు ప్రయత్నించాడు. కాని జ్ఞాపకం రావటంలేదు.

ఆ అమ్మాయి వంట ఇంట్లోకి పోతుంది. మూడు నిముషాల్లో బయటకొస్తుంది. ఇంట్లోకీ బయటకూ తిరగటమే ఆ అమ్మాయి పనిలాగుంది. మావయ్య దగ్గరకు రావటం "మావయ్యా అవి తెప్పించు, ఇవి తెప్పించు" అని చెప్పటం అవెక్కడున్నాయి, ఇవెక్కడున్నాయి, అని అడగడమూ పూరిక తేనెటీగలాగా పరిగెత్తుతున్నది. వయస్సు పదిహేను, పదహారు సంవత్సరాలుంటాయి. లలిత అంతే ఎత్తు, రామం జ్ఞాపకం తెచ్చుకోవటానికి బహు శ్రమపడ్డాడు. ప్రతిసారీ "ఎక్కడో చూసి నట్లుంది" అనుకుంటాడు. గుర్తుమటుకు రావటం లేదు. రామం ఇలా డైలామాలోపడి కొట్టుకుం టుండగానే ఆ అమ్మాయి చక్కావచ్చి "ఏం, అన్నయ్యా నేను గుర్తున్నానా?" అని అడిగింది. రాముం, విహ్వలుడై కాసేపు తెల్లబోయి కాసేపు ఆ అమ్మాయి మొహంలోకి చూసి తొందరగా వదుల్చుకునే దృష్టిలో "గుర్తున్నావు" అన్నాడు. ఆ అమ్మాయి రామం తెల్లబోవటం, తడుముకోవడం చూసింది. ఇల్లు ఎగిరిపోయేలాగా నవ్వుతూ "గుర్తు న్నానూ? భలేభలే! అయితే నేనెవరో చెప్పు?" అన్నది. రామం నెత్తిన పిడుగు పడ్డట్లయింది. అలాంటి ప్రశ్న శ్రుతిపుటాలకు సూటిగా తగులు తుందని అతడనుకోలేదు. ఆ అమ్మాయి మొహం, ఆ మాట్లాడే తీరూ చూస్తుంటే నవ్వొస్తున్నది. రామం, అర్థంలేకుండా నవ్వేశాడు. పెద్దచిక్కున బడ్డాడు. గజేంద్రుడి మొరవిని శ్రీమన్నారాయణ మూర్తి ప్రత్యక్షమైనట్లు వొక్కసారి మామయ్య అక్కడ ప్రత్యక్షమై "పార్వతీ, చూడు ఆ జీడి పప్పు డబ్బాకావాలట వంటాయన అడుగుతు న్నాడు. చిన్నగదిలో పెట్టివుంది. అత్తయ్యనిన్ను పిలుస్తున్నది"అన్నాడు. పార్వతి పరుగెత్తుకొని పోయింది. రామం నిట్టూర్పు విడచి పేరన్నా తెలిసింది, ఈసారి నేనెవరని అడిగితే, నువు పార్వ తివి' అనిన్నా చెప్పవచ్చు అనుకున్నాడు రామం. "ఈ ఇంట్లో, యీ వచ్చిన వాళ్ళలో వొక్కరు కూడా పార్వతికి తెలియనివాళ్ళ లేరు" అను కున్నాడు రామం "మావయ్యా అని పిలిచి, ఇందాక ఆ అమ్మాయి ఎవరు?"అన్నాడు.

"వెంకటరత్నం బావ కూతురురా, పార్వతి, రాజమండ్రి వెళ్ళారు. ఆసరాగావుంటారని, వారం రోజులైంది వాళ్ళను నా వెంట తీసుకొచ్చాను" అన్నాడు. రామం నవ్వుకున్నాడు. పార్వతిని తాను గుర్తుపట్టలేక పోవటానికి కారణం, చూసి ఫదేళ్లు కావటమే. వెంకటరత్నం బాబాయి చచ్చి పోయినప్పుడు తామంతా మామయ్యా వాళ్ళ తోటి కలసి రాజమండ్రి వెళ్ళారు. అప్పుడు పార్వ తికి ఆరేళ్ళు తనకు పన్నెండేళ్లు. తండ్రి చచ్చి పోయి. బెంగగా యేడుస్తుంటే, తాను దగ్గరకు తీసుకోని అవీ, ఇవీ కొనిపెట్టి, కథలుచెప్పి, ఎప్పుడూ తనతోటే వుంచుకునేవాడు. రామానిక వన్నీ గుర్తొచ్చినయ్. సాయంత్రానికి తమాషాగా మాట్లాడాలి అనుకున్నాడు.

పార్వతి చెప్పిన పని చేయించి వరండాలోకి వస్తుంటే నడిమిహాల్లోంచి లలిత కేకేసింది. 'ఒసే పార్వతీ, చూడవే. నన్నొంటిదాన్ని చేసి, యేడి పిస్తున్నది ఇందిర, చప్పునరా" అంది. పార్వతి డైరెక్షన్‌మార్చి హీరోయిన్‌లాగా వెళ్ళి వాళిద్దరి మధ్యానిల్చొని "ఏమంటున్న దేమిటే లలితా?"అని అడిగింది. "చూడు ఇందాకటినుంచీ, మీ ఆయన నీకు ఉత్తరాలు రాస్తున్నాడా? ఎన్నాళ్ళకో ఉత్తరం రాస్తున్నాడు?" అని అడుగుతున్నది.

లలిత ఫిర్యాదు చెప్పేసింది. పార్వతి అన్నది. "ఇందిరా, దాని మొగుడు పాపం, వొట్టి వెర్రి బాగుల వాడులాగావుంది. రేపటినుంచి మీ ఆయనకు నీవు రెండేసి ఉత్తరాల చొప్పున రాస్తూండు." లలిత కిలకిల నవ్వింది. ఇందిర మొహం చిట్లించుకొని, "నీతోటి వేగటం కష్టమమ్మా పార్వతీ, నీకోదండం, నీతోటి మాట్లాడటమే కష్టం" అన్నది, "అయితే నేనొక పని చెప్తా చేస్తావు? నాతో పోట్లాటానికి మీ ఆయన్నుతోడు తీసుకొచ్చుకో" అంది ఇందిర ప్రయత్నించి మూతి బిగపట్టుకొని, ఆపుకోలేక నవ్వేసింది లలిత "తిక్క వదిలింది, అమ్మాయిగారికి." అంది. పార్వతి ఏదో అనబోతుంటే ఇంతలోకే పిలుపొచ్చింది. పార్వతి వెళ్ళిపోయింది. మళ్ళీ వచ్చేటప్పుడు వొక కొత్త అమ్మాయిని వెంటబెట్టుకొని వచ్చింది. ఖరీదుగల గుడ్డలు, ఫాషను ఆమెను గొప్పింటి బిడ్డ అని పరిచయం చేస్తున్నాయి. ఈ అమ్మాయిని పరిచయం చేస్తున్న ధోరణిలో పార్వతి, "ఏమే లలితా, వీరి నెరుగుదువా, ఎఱగవుగదూ, అమ్మమ్మ నడుగు, ఏం చెబుతుందో, అమ్మమ్మ మేనత్త కొడుక్కి మనవరాలు" అని చెప్పి నవ్వటం ప్రారంభించింది. ఆ యువతి తెల్లబోయింది. "ఏమిటే ఆ నవ్వు, అదీ" అంది లలిత మందలిస్తూ. ఈ నవాగత తరుణి విస్మయాధిక్య వదనం కేసిచూసి పార్వతి "ఈవిడ పేరు శైలజ, బి. ఎ. చదువుతూంది. రాజమంద్రీ నా తెలివితక్కువ మొహానికి తెలీలేదు. ఒకేచోట వుంటూకూడా ఇంతమటుకు వీళ్ళు మనచుట్టాలని తెలుసుకోలేక పోయాను" అంది. పార్వతి మాట్లాడే విధంచూసి, శైలజకు ఆశ్చర్యం ముంచుకొస్తున్నది. ఇంతకుముందు పరిచయంకూడా లేదు, యీ అమ్మాయి ఇలా, ఎలా మాట్లాడగలుగుతున్నది? అని శైలజ ఆశ్చర్యం. పార్వతి అంతటితో ఆపకుండా "ఓసే లలితా, వీళ్ళు ఆడపెళ్ళి తరఫువాళ్ళు, మనం మొగపెళ్ళివారం, తెలిసిందా, శైలజా మీరూ కూచోని మాట్లాడుకుంటుండండి" నేను వస్తానని నాలుగడుగులేసి మళ్ళీ వెనక్కువచ్చి "చూడు శైలజా, పెండ్లికూతురెక్కడ వుందన్నావుగదా, అదిగో, ఆవిడ పెండ్లి కూతురూ, ఈవిడ ఆవిడ మరదలూ. కూచునుండు వస్తా" అని వెళ్ళిపోయింది.

శైలజకు పార్వతి ముందు నిలుచోవాలంటే ముళ్ళమీద నిల్చున్నట్లే అనిపించింది. పార్వతి వెళ్ళిపోయిన తర్వాత గాలిపీల్చుకున్నది. అక్కడనే పెట్టెమీద కూలబడిపోయింది. ఇందిర, శైలజా, పుస్తకాల గొడవలో పడిపోయారు. లలితలేచి రామంపద్దకొచ్చి "స్నానం చేసేటట్లయితే ఇప్పుడే చెయ్యి అన్నయ్యా" అన్నది. రామం గుడ్డలు తీసుకొని స్నానం చేయటానికి లేచాడు. పార్వతివచ్చి "శైలజా తాతగారెందుకో నిన్ను పిలుస్తున్నారు" అని చెప్పిపోయింది. శైలజ వెళ్ళి ఎందుకు తాతయ్యా అని అడిగింది. "కాఫీ టిఫినూ తీసుకున్నావా అమ్మ, నీవొద్దన్నా, పార్వతి వూరుకునేది గాదుగా" అని 'వూరికినే పిలిచాను, పెండ్లికూతురిని చూశావా, మాట్లాడావ ?' మనమొచ్చి యీ యింటికెన్నేళ్ళైందమ్మా", అన్నాడు. శైలజ తలూపుతూ ఇంకేమైనా వుందా, తాతయ్యా అంది. ముసలాయన నవ్వుతూ "కోపమొచ్చినట్లుంది తల్లికి," అన్నాడు లాలనగా చూస్తూ శైలజ నవ్వి "ఏవూరొచ్చినా, నన్ను నాలుగు నిముషాలు వదిలి వుండకపోతే ఎట్లాతాతయ్యా, ఇప్పుడేగా నీకూ నాకూ ఆ అమ్మాయి కాఫీ యిచ్చిపోయింది" అంది. ముసలాయనవ్వి "ఏదో వృద్ధుణ్ణి. మనసు పాటవం తప్పింది. సరే వెళ్ళు, ఏం కావాలన్నా ఆ పార్వతిని అడుగు చూపిస్తుంది" అన్నాడు.

రామం స్నానంచేసి వచ్చినతర్వాత, లలిత గుడ్డ లందిస్తూ విడిచిన గుడ్డలు మడతబెడుతున్నది ఇంతలోకే శైలజ వచ్చి "మీ పేరు లలితగదూ? చూడండి, నాకు పార్వతి కనపడలేదు. ఇక్కడ నా కెవరూ తెలీదు. బాత్‌రూమ్ కాస్త చూపిస్తారా" అంది. లలిత చిరునవ్వు నవ్వుతూ "నేను లలితనే. కాని, నన్ను 'అండీ' అని గౌరవం చేయవలసిన అవసరంలేదు. లలితా అంటే సరిపోతుంది" అన్నది. శైలజ చిన్నబోయింది. తానిక్కడకు వచ్చినప్పటినుంచి పార్వతి మాట్లాడేవిధం చూసి ఆశ్చర్యపడుతున్నది. ఇప్పుడు లలితకూడా అంతే. వీళ్ళకు సభ్యత తెలీదుగాబోలు. అయితే తాము ఇక్కడ రెండు రోజులున్నట్లే. శైలజ మనసులో కొద్దిగా ఏవగించుకొని "సరే ముందు బాత్-రూమ్ చూపించండి" అంది. లలిత ఏదో అనబో

తుంటే రామం "సరే ముందు చూపించవోయ్" అన్నాడు. మళ్ళీ వచ్చి గుడ్డలు సర్దుతుంటే రామం అడిగాడు ఆ అమ్మాయి ఎవరని, లలిత చెప్పింది. రామం చాలా ఆశ్చర్యపడ్డాడు. ఆ అమ్మాయి జీవిత చరిత్రనంతా విని. ఒక్క పలుచగా, పొడుగ్గా, రెండు జడలతో వున్న ఆ అమ్మాయిని మొదటసారి చూసినప్పుడే, రామం విస్మయానికి వొక దరిదాపూ కన్పించలేదు.

"అయితే తల్లి తండ్రీ ఎవరూ లేరటనా, లలితా?" అని అడిగాడు రామం. "లేరట అన్నయ్యా, తాతగా రొక్కడే వున్నారు. బి. ఎ. చదువుతున్నది. దూరపు చుట్టరికం. ఇందిరకు అక్కయ్యవరస" రామం మరేం మాట్లాడలేదు. ఒక్కసారి బక్క పలుచటి, ఆ అమ్మాయి కోల మొహంలోని లోతుకళ్ళను మనసులో చూసి కదలిపోయాడు.

(ఇంకా వుంది)

స్వగతం

# దండయాత్ర

అద్దేపల్లి లక్ష్మి

ఇది నాలుగో దండయాత్ర. అంటే ఇప్పటికి మూడు దండయాత్ర లయినాయన్నమాట. మూడింటిలోకూడా ధైర్యంగా వెనుకడుగే వేయవలసి వచ్చింది. మొదటి దండయాత్రలో విజయము రాకపోయేటప్పటికి ఏదో గ్రహపాటు అనుకున్నాను. రెండవసారికూడా పరాజితురాల్నవటంతో ఇదేదో పొరపాటై యుండాలి సుమా అని దృఢనిశ్చయం చేసుకున్నాను. మూడవ సారి ముఖ్యంగా వెడదాము. ఈసారితో ఫైనలు అని ఎంతో మథనపడ్డాను. ఆసారికూడా మనకు దురదృష్టదేవతే ఎదురైంది. అలవాటుపడ్డాను అనుకున్నాను. అంతకంటె చేసేదేముంది?

ఈసారి చతురంగ బలాలను సమకూర్చి, బలిష్టం చేసి, ఎంతో రిహార్సల్సు జరిపి యుద్ధానికిపంపాను. మరి విజయం ఏమవుతుందో ఏం చెప్పగలను. ఇంకా ఒక్కనెల ఆగితే తేలుతుంది. పత్రికలో నంబరు కనపడపోతే, అది నాతప్పే అవుతుందో, లేక నన్ను భూమిమీద పడవేసిన భగవానుని అనుగ్రహమో! ఇప్పటికి మూడు దండయాత్రలు విఫలమయేటప్పటికి, నాలుగోదినా కనుమానంగానే వుంది. దండయాత్రలు చెయ్యడమే అలవాటయింది గాని, దండయాత్ర లయింతర్వాత తీర్థయాత్రలు చేయటం అలవాటుకాలేదు. దానికి కారణాలున్నాయి లేకపోలేదు. ఒకటి స్తోమతు లేకపోవడం రెండవది నామీద నాకే నమ్మకంలేదా అనేఅహం. అంటేనే చదివినదానిమీద, నాకు తెలిసిన దానిమీద, నా బుద్ధిమీద నా పరిజ్ఞానంమీద నాకే నమ్మకంలేదన్నమాట. నే వ్రాసిన పేర్లు ఇంకెవరో త్రాసులోతూచి, పడికట్టురాళ్ళ లేఖవేసి," ఇదిగో నీకు 35 పరసెంటు మాత్రమే జ్ఞానముంది. నూటికి నూరు పాళ్ళులేదు. అయినాగాని ఏదోదయతలచి నిన్ను మానవులలో కలిపేస్తున్నాము."అని ఇంకొకరు చెప్పితేగాని లాభంలేదు. అప్పుడుగాని నాకు డిగ్రీరాదు. ఆ డిగ్రీ పుచ్చుకుని భిక్షాటనకు బయలుదేరితేగాని మోక్షంరాదు.కాని బిచ్చంవేసేదెవరూ!

పోసీ ఏదో కష్టపడి తీర్థయాత్రలకు బయలుదేరుతామే అనుకోండి, ఏ పంతులుగార్నో పట్టుకుంటాం. ఆయనకు వెళ్ళిన పేపర్లో మనకు స్వతహాగానే, అధికారుల కొలబద్ద ప్రకారం సగం జ్ఞానముందనుకోండి. సంతోషించి వెళ్ళిపోతాం. కాని ఇది చూచి గిట్టని, ఓశరభయ్యా, ఆ పంతులు గారిమీద వెంటనే ఏ ఆకాశరామన్న ఉత్తరం అధికారులకు కురిపించేస్తాడు. దాన్తో ఆ పంతులు గారి మీద తణిఖీ ఖర్మం. ఇందులో ఆయన చేసిన పాపం ఏమీలేదు. ఒక్కటితప్పు: బడిపంతులవడం. లేదా హైస్కూలు టీచరవడం కాదంటారూ కొంచెం ఘనంగా నేపిలుద్దాం కాలేజీ ప్రొఫెసరవడం అది ఆయనచేసిన మహాపాతకం. ఆయన చదువవలసినదా మాస్టరు డిగ్రీ ఫస్టుక్లాసులోప్యాసు కావాలి. (బడిపంతులకు మాత్రమే సుమండీ!' ఇంక